క్లుప్తంగా

విష్ణాలయంలో ఏకాదశి పూజలు



ఆలయంలో జరుగుతున్న అన్నదానం

మనుబోలు : ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక విష్ణాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు హనుమాచార్యులు శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవునికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం సంప్రదాయబద్ధంగా విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చల్లా బలరామయ్య మస్తానమ్మ దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు.

ఆర్థిక సాయం అందజేత



పొదలకూరు : మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు అన్నం శ్రీనివాసులు కుటుంబానికి గౌడ్ సేవాసమితి ట్రస్ట్ సభ్యులు సోమవారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తూ శ్రీనివాసులు ఆదివారం గుండెపోటుకు గురై మృతిచెందారు. తక్షణ సాయం కింద ట్రస్ట్ వ్యవస్థాపకుడు దివంగత కోసూరు గోవిందయ్య ఆశయ సాధన కోసం సమితి జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్, కోసూరు రాజశేఖర్‌గౌడ్‌లు రూ.10 వేల సాయాన్ని గ్రామంలో అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గౌడ్ సంఘం సభ్యులు కోసూరు జనార్దన్‌గౌడ్, బడుగు చెంచుప్రసాద్‌గౌడ్, గ్రామ సొసైటీ ప్రెసిడెంట్ కొమర రమణయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ముత్తుకూరు : ముత్తుకూరు కూడలిలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధనరెడ్డి సోమవారం ప్రారంభించారు. స్థానికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎంపీపీ గండవరం సుగుణ, సర్పంచ్ బూదూరు లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు షేక్ నవీద్‌బాషా, వెంకటేశ్వర్లు, నాయకులు కె.లక్ష్మణరెడ్డి, ముత్యంగౌడ్, సూరి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నెల్లూరు శివప్రసాద్, రాగాల వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బుచ్చిలో..



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ సుధీర్

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం తాగునీటి చలివేంద్రాన్ని తహసీల్దార్ సుధీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం వేసవి నేపథ్యంలో సీఐటీయూ, ఆటో స్టాండ్ వారు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు చల్లకొలుసు మల్లికార్జున, రాధయ్య పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

కోవూరు : సచివాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దార్ పద్మజ కోరారు. మండలంలోని పడుగుపాడు -3 సచివాలయాలన్ని ఆమె సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందనలో వచ్చే అర్జీలకు తక్షణ పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం రికార్డులు తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.

వివాహితకు వేధింపులు

నెల్లూరు(క్రైమ్): తనతో మాట్లాడమని వివాహిత చేయిపట్టుకుని లాగిన వ్యక్తిపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..స్టోన్‌హౌస్‌పేటలో ఓ దంపతులు నివాసం ఉంటున్నారు. భర్త వ్యవసాయం చేసుకుంటుండగా, భార్య నగరంలోని ఓ షాపులో పనిచేస్తున్నారు. వారి ఇంటి సమీపంలో ఉన్న మునీర్ గత కొంతకాలంగా ఆమెను తనతో మాట్లాడమని వేధింపులకు గురిచేయసాగాడు. ఈ నేపథ్యంలో గత నెల 30న రాత్రి ఆమె బాత్‌రూమ్‌కు వెళుతుండగా మునీర్ ఆమె చేయిపట్టుకుని తనతో మాట్లాడమని ఒత్తిడి తెచ్చాడు. బాధితురాలు పెద్దగా కేకలు వేయడంతో భర్త, స్థానికులు రాగా నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ మేరకు బాధితురాలు సోమవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కే తిరుపతయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక జెండా రెపరెపలు

కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ మేడే సంబరాలను వాడవాడలా కార్మికులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కార్మిక జెండాను ఎగురవేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. చలివేంద్రాలను ప్రారంభించారు.



కోవూరు మండల కేంద్రంలో మేడే సంబరాలు జరుపుకుంటున్న వామపక్ష నేతలు

● వాడవాడలా మేడే వేడుకలు

మనుబోలు : మండలంలోని పలు గ్రామాల్లో మేడే వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మనుబోలులో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మనుబోలు బైపాస్ రోడ్డు కూడలిలోని వైఎస్సార్ విగ్రహం సమీపంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించి ఆటోస్టాండ్ వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్‌లకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వామపక్ష కార్యకర్తలు ఎర్రజెండాలు పట్టుకుని వైఎస్సార్ సర్కిల్ నుంచి మనుబోలు అంబేడ్కర్ విగ్రహం వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం, సీఐటీయూ నేతలు రమేష్, దేవదానం, ఆదిశేషయ్య, శివయ్య, శ్రావణ్, వెంకటేశ్వర్లు, బలరామయ్య, ఖాదర్‌వలి, విద్యుత్ యూనియన్ నేతలు బండి శ్రీనివాసులు, కందలి వెంకటేష్, ఆటో యూనియన్ నేతలు పాల్గొన్నారు.

పొదలకూరులో..

పొదలకూరు : ప్రపంచ కార్మికుల్లారా ఏకం కండి అంటూ పట్టణంలో సీపీఎం, సీఐటీయూ, అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో మేడే వేడుకలను సోమవారం నిర్వహించారు. ముందుగా స్థానిక సీపీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెంచలనర్సయ్య మాట్లాడుతూ చికాగోలో ప్రారంభమైన కార్మికుల నిరసన 1923లో భారత్‌లోకి అడుగుపెట్టినట్లు తెలిపారు. 100 సంవత్సరాల కార్మిక పోరాటంలో అనేక సమస్యలను పరిష్కరించుకోగలిగినట్లు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేస్తామని సీఐటీయూ మండల కార్యదర్శి మనోహర్ అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల యూనియన్ నేతలు స్వర్ణలత, లక్ష్మి, ఆటో డ్రైవర్ల సంఘ నేతలు రాఘవులు, మస్తానయ్య, శ్రీనివాసులు, హమాలీల నేత అంకయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో..

ముత్తుకూరు : మేడే సందర్భంగా ముత్తుకూరు బజారు సెంటర్‌లో సోమవారం వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో పతాకాన్ని ఆవిష్కరించారు. ఆటో కార్మికులు, డ్రైవర్ల సమక్షంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నడవడి ముత్యంగౌడ్ ఈ పతాకాన్ని ఎగురవేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధనరెడ్డి పాల్గొని, మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. సర్పంచ్ బూదూరు లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదే విధంగా సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో మేడే సందర్భంగా పార్టీ పతాకాలను ఆవిష్కరించారు.

మత్స్యకళాశాలలో..

ముత్తుకూరులోని మత్స్యకళాశాలలో మేడే సందర్భంగా సోమవారం ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఫిషరీస్ డీన్ డాక్టర్ రవీంద్రకుమార్‌రెడ్డి ద్వారా కేక్ కట్ చేశారు. కార్మిక నేత కృష్ణమోహన్ ఆయనకు కేక్ తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మేడే విశిష్టతను వివరించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ రామలింగయ్య, వివిధ విభాగాల ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

టీపీగూడూరులో..

తోటపల్లిగూడూరు : మండల పరిధిలోని నరుకూరు సెంటర్, కామాక్షినగర్, పేడూరు, కృష్ణారెడ్డిపాళెం, తోటపల్లిగూడూరు, ఇస్కపాళెం, సాలిపేట తదితర గ్రామాల్లో వామపక్ష నేతల ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు. పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. ఈ క్రమంలో నరుకూరు సెంటర్‌లో సీఐటీయూ జెండాను ఆవిష్కరించడంతో పాటు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి అజయ్‌కుమార్ మాట్లాడుతూ 8 గంటల పనిదినాన్ని ఉద్యమాల ద్వారా సాధించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మారుబోయిన రాజా, సీపీఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సభ్యులు కాల్తిరెడ్డి రమణమ్మ, వేగూరు శంకరయ్య, పరుశు రామయ్య, శివ, గోపీ, మల్లి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ముత్యాల గురునాథం మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీని ఓడించేందుకు అన్ని పార్టీలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. మోదీ పాలనలో ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాల వల్ల తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు శ్రీనివాసులు, జానీబాషా, మాల్యాద్రి, శీనయ్య, ఖాదర్‌బాషా, కోటయ్య, అంకయ్య పాల్గొన్నారు.

మండల కేంద్రంలో..

కోవూరు : కోవూరు మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ సీనియర్ నేత జొన్నలగడ్డ వెంకమరాజు పాల్గొని, సీపీఎం సిద్ధాంతాలను వివరించారు. కాగా మేడే సందర్భంగా ప్రధాన కూడళ్లను ఎర్ర తోరణాలతో నింపారు. అనంతరం పలు ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో శేషయ్య, బాబు, జక్కా శేషమ్మ, రమేష్, కాలేషా, సుజాతమ్మ, ఖాదర్‌బాషా, బుజ్జయ్య పెద్దబ్బయ్య పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల అభివృద్ధే బీజేపీ ధ్యేయం

కొడవలూరు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ విమర్శించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో మేడేను పురస్కరించుకుని కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దు చేయడం అమానుషమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు నరసింహం, దేవానంద్, ఆటో యూనియన్ నేతలు పాల్గొన్నారు.



మనుబోలు : నినాదాలు చేస్తున్న కార్మిక నేతలు



పొదలకూరు పట్టణంలో ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నేతలు



ముత్తుకూరు : ట్రేడ్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు



తోటపల్లిగూడూరు : నరుకూరు సెంటర్‌లో..



బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో..



ముత్తుకూరు : ఫిషరీస్ డీన్‌కు కేక్ తినిపిస్తున్న సిబ్బంది



కొడవలూరు : నార్తురాజుపాళెంలో..



మనుబోలు : సబ్‌స్టేషన్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న యూనియన్ నేతలు

సర్వేపల్లిలో వైఎస్సార్‌సీపీకి విశేషాదరణ



వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనాన్ని ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

● రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : సర్వేపల్లిలో వైఎస్సార్‌సీపీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మొగళ్లూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం మంత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.95 లక్షలతో పూర్తి చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతుభరోసా కేంద్రం భవనాలు, సిమెంటురోడ్లు, సైడ్ డ్రెయిన్లను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గంలో 79 సచివాలయాల పరిధిలో పర్యటించానని, మరో పది సచివాలయ పరిధిలో పర్యటిస్తే 'గడప గడపకు..' పూర్తవుతుందన్నారు. మొగళ్లూరు గ్రామం తమ కుటుంబానికి బాసటగా నిలిచిందన్నారు. ఎంతో అభిమానంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి సచివాలయం, రైతుభరోసా కేంద్రాల ప్రాంగణంలో మహానేత వైఎస్సార్, తన తండ్రి కాకాణి రమణారెడ్డిల విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారి రుణం తీర్చుకోలేనిదని, గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. తొలుత మంత్రి కాకాణికి గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, సర్పంచ్ ఆకుల లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు చెన్నూరు విజయలక్ష్మి, గ్రామ నేతలు పెంచల నారాయణరెడ్డి, అంకిరెడ్డి, పెదగంగిరెడ్డి, యనమాల శ్రీనివాసులురెడ్డి, ఆకుల గంగిరెడ్డి, మండలాధికారులు పాల్గొన్నారు.

జట్లకొండూరులో భూముల రీసర్వే

మనుబోలు : మండలంలోని జట్లకొండూరు గ్రామంలో భూముల రీసర్వేను అధికారులు సోమవారం నిర్వహించారు. రీసర్వే ఉప తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి రెవెన్యూ సిబ్బందికి సూచనలు, సలహాలు చేశారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే సర్వేను పూర్తి చేశామని తెలిపారు. గ్రామాల్లో హద్దులకు సంబంధించిన రాళ్లను నాటడం త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం మాట్లాడుతూ డ్రోన్ సాయంతో చేసే సర్వేతో కచ్చితమైన కొలతలు వస్తాయని తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్‌లు గోపీకృష్ణ, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్‌ను ఎగురవేస్తున్న రెవెన్యూ సిబ్బంది

రగ్బీ జూనియర్స్ విజేత జిల్లా జట్టు



విజేతగా నిలిచిన జిల్లా రగ్బీ జట్టు

కొడవలూరు : కర్నూలు ఆదర్శ విద్యామందిర్ హైస్కూల్‌లో ఆది, సోమవారాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ జూనియర్స్ పోటీల్లో నెల్లూరు జిల్లా బాలుర జట్టు ప్రథమ స్థానం దక్కించుకుంది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన జట్టు సభ్యులను జిల్లా రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి, ఉపాధ్యక్షులు పి.రమేష్, జె.శ్రావణ్‌కుమార్ కోచ్ దాసరి వంశీకుమార్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

ప్రసన్న విశ్వేశ్వరునికి సింహ వాహనసేవ

● వేడుకగా గ్రామోత్సవం

ఇందుకూరుపేట : మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లను పలు రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. మేళతాళాల నడుమ విద్యుద్దీపాలంకరణలో గ్రామోత్సవం జరుగుతున్న స్వామి, అమ్మవార్లకు భక్తులు వాకిళ్లలో ముగ్గులు పరిచి స్వాగతం పలికారు. పండ్లు, కొబ్బరికాయ, కర్పూర హారతులు అందజేసి తన్మయం చెందారు. ఆలయ అర్చకులు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న సింహ వాహనోత్సవానికి ఉభయదాతలుగా పుట్టా రాఘవయ్య, వెంకమ్మ జ్ఞాపకార్థం మనుమడు పుట్టా బాలాజీ, నీలిమ దంపతులు వ్యవహరించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కనుపూరు సురేంద్రబాబు, ఈఓ సురేంద్ర, ధర్మకర్తలు పాల్గొన్నారు.

విశేష పూజలు

వైఎస్సార్‌సీపీ నేత దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి బ్రహ్మోత్సవాలు పాల్గొని అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది ఆయనకు సాదర స్వాగతం పలికారు. శాలువతో సత్కరించి ఆశీర్వాదాలు, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆక్వా సొసైటీ డైరెక్టర్ పామంజి నరసింహ, సర్పంచ్‌లు సంగం వెంకయ్య, తాతా సురేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు రమణయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీహరికోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సింహవాహనంపై ఊరేగుతున్న అన్నపూర్ణంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామి



పూజలు నిర్వహిస్తున్న కల్యాణ్‌కుమార్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం : గేదెలు అడ్డురావడంతో మోటారు బైక్ అదుపుతప్పి పడిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో సోమవారం జరిగింది. గూడూరు పట్టణానికి చెందిన కృష్ణమోహన్, మనోహర్ పనినిమిత్తం బైక్‌పై కృష్ణపట్నం వెళ్లారు. తిరిగి గూడూరు వెళ్తుండగా సర్వేపల్లి సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై గేదెలు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో కృష్ణమోహన్, మనోహర్‌లకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేకువజామునే పింఛన్ల పంపిణీ



మామిడిపూడిలో పింఛన్ నగదును అందజేస్తున్న వలంటీర్ హసీనాబేగం

ముత్తుకూరు : మండలంలో ప్రభుత్వ సామాజిక పింఛన్ల పంపిణీ సోమవారం వేకువజాము నుంచే ప్రారంభించారు. పలు గ్రామాల్లో ఉదయం 10 గంటలకే పంపిణీని పూర్తి చేశారు. మామిడిపూడి గ్రామంలో వలంటీర్ హసీనాబేగం ఉదయం 5 గంటలకు టార్చిలైట్ వెలుగులో ఇళ్లిల్లూ తిరిగి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్ నగదును అందజేశారు.

సమస్యలను వెంటనే పరిష్కరించండి

మనుబోలు : ప్రజా సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మనుబోలులోని రెండు సచివాలయాలను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి అర్జీల రూపంలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. సచివాలయ సిబ్బంది యూనిఫాం ధరించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ యూనిఫాం ధరించాలని ఆదేశాలిచ్చారు. సమయపాలన తప్పక పాటించాలన్నారు. ఆయన వెంట వీఆర్వో నాగార్జునరెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్

కిక్కిరిసిన భక్తజనం



భక్తులకు విభూదిని అందజేస్తున్న విజయేంద్ర సరస్వతి స్వామి



కలశాలను తీసుకొస్తున్న అర్చకులు

● వేడుకగా సాగుతున్న మహా కుంభాభిషేక పూజలు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో మహాకుంభాభిషేక వేడుకల్లో భాగంగా సోమవారం భక్తులు పోటెత్తారు. ముందుగా నూతనంగా నిర్మించిన ఆలయ ముఖద్వారాన్ని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఆయన భక్తులకు ఆశీస్సులు అందించారు. అనంతరం ఆలయానికి చేరుకుని యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ రామారావు, ఎస్సై వీరప్రతాప్ తమ సిబ్బందితో కలిసి ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ముఖద్వారా ఉభయకర్తలు ముప్వా బలరామనాయుడు కుమారుడు ముప్వా చంద్రశేఖర్, ప్రీతిసెల్వీ, పాలకమండలి సభ్యులు నందకుమార్, రఘురామయ్య, శివకుమార్, పద్మ, విమల, సుప్రజ, విజయమ్మ, కామేశ్వరి, శశిశేఖర్‌శర్మ పాల్గొన్నారు.